


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 30 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :339 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఆపదలో ఉన్న మహిళలను కాపాడే అస్త్రం దిశ యాప్: సీఎం జగన్



విజయవాడ: ప్రతి మహిళకు దిశ యాప్ అవసరమని, దిశ యాప్‌పై ఇంటి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దిశ యాప్‌కు మహిళా పోలీసులు, వాలంటీర్లే అంబాసిడర్లు అని సీఎం జగన్ పేర్కొన్నారు. మంగళవారం 'దిశవ మొబైల్ యాప్ అవగాహన సదస్సులో భాగంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామానికి చేరుకున్న సీఎం జగన్.. మహిళా భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దిశ మొబైల్ యాప్‌ను విద్యార్థినులు, యువతులు, మహిళలు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన స్వయంగా వివరిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. దిశ యాప్‌పై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలిని, ప్రతి మహిళతో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని సీఎం జగన్ అన్నారు. దిశ యాప్‌కు మహిళా పోలీసులు, వాలంటీర్లే అంబాసిడర్లు అని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ఘటన కలిచివేసిందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. యువతులు, మహిళల భద్రత కోసం దిశ యాప్ రూపొందించామని, ఇప్పటికే దిశ యాప్ నాలుగు అవార్డులు సొంతం చేసుకుందని గుర్తుచేశారు.ఇప్పటికే 17 లక్షల మంది దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని, స్మార్ట్ ఫోన్ ఉండే ప్రతి మహిళ వద్ద దిశ యాప్ ఉండాలని సీఎం జగన్ చెప్పారు. ఫోన్‌లో దిశ యాప్ ఉంటే ఒక అన్న తోడుగా ఉన్నట్టే, ఆపదలో ఉన్న మహిళలను కాపాడే అస్త్రం దిశ యాప్ అని తెలిపారు. పోలీసులు మనకు మంచి చేసే ఆప్తులు, మహిళల భద్రత, రక్షణపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని సీఎం జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 దిశ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసి, దిశ చట్టం కూడా చేశామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. దిశ కేసుల కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం చేపట్టామని, దిశ కేసుల విచారణ కోసం త్వరలోనే ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు మాట్లాడుతూ.. నేరం జరగడానికి ముందే దాన్ని నియంత్రించాలనుకోవడం గొప్ప చర్య అని, సీఎం జగన్ నిర్ణయాలతో మహిళలకు



నిజమైన స్వేచ్ఛ వచ్చిందన్నారు. ఇప్పటి వరకు సీఎం జగన్ లాంటి గొప్ప ముఖ్యమంత్రిని తాము చూడలేదని వాలంటీర్లు చెప్పారు.

## కోవిడ్ బాధితుల్ని ఆదుకోవాలని చంద్రబాబు సాధన దీక్ష

అమరావతి జూన్ 29 కోవిడ్ బాధితుల్ని ఆదుకోవాలని సాధన దీక్ష టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిరసనకు దిగారు. మంగళవారం ఉదయం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు నిరసన దీక్ష చేపట్టారు. ముందుగా దివంగత నేత స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి... ఆపై టీడీపీ అధినేత దీక్షలో కూర్చుకున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని



నియోజకవర్గ కేంద్రాల్లో టీడీపీ శ్రేణులు దీక్ష చేయనున్నారు. 12 డిమాండ్ల పరిష్కారానికి సాధన దీక్షకు దిగారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించాలన్నారు. కరోనా తీవ్రత కొనసాగినంతకాలం నెలకు రూ.7,500 అందించాలని డిమాండ్ చేశారు.కరోనా మృతుల కుటుంబాలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని అన్నారు. ఆక్సిజన్ మరణాలన్నిటికి ప్రభుత్వానిదే బాధ్యత కాబట్టి వారి కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కరోనా ఫ్రంట్ లైన్ వారియర్స్ కుటుంబాలకు రూ. 50 లక్షలు అందించాలని అన్నారు. జర్నలిస్టులను కరోనా వారియర్స్‌గా గుర్తించి వారికి బీమా సౌకర్యం కల్పించాలని, వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ప్రజలందరికీ వ్యాక్సిన్ లను ఉచితంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబుతో పాటు అచ్చెన్నాయుడు, రానానాయుడు యనమల, సోమిరెడ్డి, చినరాజప్ప, ఫరూక్, వర్ల, నక్కా ఆనంద్ బాబు, కొల్లు రవీంద్ర, అనగాని, బోండా, అనిత, బీదా రవిచంద్ర, మంతెన సత్యన్నారాయణ రాజు, టీడీ జనార్దన్, గుమ్మడి సంధ్యారాణి, అశోక్ బాబు తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

## మార్కెట్లోకి మరింత ఆలస్యంగా స్పుత్నిక్ వీ టీకా..



న్యూఢిల్లీ : స్పుత్నిక్ వీ కోవిడ్ టీకాలను మార్కెట్లోకి రిలీజ్ చేసేందుకు మరింత సమయం పట్టనున్నది. ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధి ఒకరు ఈ విషయం తెలిపారు. టీకాల దిగుమతి, క్వాలిటీ టెస్టింగ్ ఆలస్యం కావడం వల్ల.. స్పుత్నిక్ వీ టీకాలను మార్కెట్లోకి రిలీజ్ చేయడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పైలట్ దశలో ఆ టీకాలను కొన్ని నగరాల్లో అందిస్తున్నారు. 28 నగరాల్లో స్పుత్నిక్ వీ టీకాలను అందుబాటులోకి తెచ్చేందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రయత్నిస్తున్నది. అయితే మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశాలపై క్లారిటీ లేదని అపోలో హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి.రెండు డోసుల స్పుత్నిక్ టీకాలు వేరువేరుగా ఉంటాయి. ఆడినోవైరస్ ద్వారా ఆ టీకాలను తయారు చేశారు. కానీ రెండు డోసుల్లో తేడా ఉంటుంది. 21 రోజుల వ్యవధిలో ఆ టీకాలను ఇవ్వాలి. బహుశా రెండు వేరువేరు డోసులు రాని కారణంగా.. స్పుత్నిక్ వీ పంపిణీ ఆలస్యం అవుతున్నట్లు భావిస్తున్నారు. రష్యాకు చెందిన స్పుత్నిక్ వీ టీకాలను ఇండియాలో రెడ్డీస్ ల్యాబ్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే.

## ప్రవాసాంధ్రుల దాతృత్వం

**రూ.4.28 కోట్ల విలువైన వైద్య సామగ్రి వితరణ**

**ఏపీఎన్ఆర్టీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రులకు పంపిణీ**

**పంపిణీ ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి, మల్లాది విష్ణు**



అమరావతి: రాష్ట్రంలో కోవిడ్ కట్టడి చర్యలకు ప్రవాసాంధ్రులు సాయం అందించారు. సుమారు రూ.4,28, 08,885 విలువైన వైద్య పరికరాలను ఏపీఎన్ఆర్ టీఎస్ సంస్థ ద్వారా ప్రభుత్వాస్పత్రులకు అందించారు. సోమవారం తాడేపల్లిలోని ఏపీఎన్ఆర్టీఎస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీఎన్ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి, సీఈవో కె.దినేష్‌కుమార్, భవకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి అవసరమైన వైద్య పరికరాల వివరాలను స్టేట్ కోవిడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో సమన్వయం చేసుకుంటూ ప్రవాసాంధ్రుల నుంచి వాటిని సేకరించడంలో ఏపీఎన్ఆర్టీఎస్ విశేష కృషి చేస్తోందంటూ కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఏపీఎన్ఆర్టీఎస్ పనిచేస్తోందని వెంకట్ మేడపాటి అన్నారు. ఏపీకి వైద్య పరికరాలను పంపాలనుకునే వారికి వివిధ దేశాల్లో ఉన్న తమ కోఆర్డినేటర్లు సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 70 ఏరియా, పెద్దాస్పత్రులకు వైద్య సామగ్రి పంపిణీ జరిగిందన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణానికి సిద్ధార్థ మెడికల్ కాలేజీ, గుంటూరు మెడికల్ కాలేజీలకు చెందిన పూర్వ విద్యార్థి సంఘాలు ముందుకు రావడం హర్షణీయమన్నారు.

## సీఎం జగన్ సమక్షంలో 'దిశ యాప్ లైవ్ డెమో

**తక్షణమే స్పందించి.. లొకేషన్‌కు చేరుకున్న భవానీపురం పోలీసులు**

తాడేపల్లి: విజయవాడ గొల్లపూడిలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో దిశ మొబైల్ యాప్ అవగాహన సదస్సు జరిగిన సంగతి తెలిసిందే. సీఎం జగన్ సమక్షంలోనే వాలంటీర్లు దిశా యాప్ లైవ్ డెమో చేసి చూపించారు. యాప్ నుంచి మెసేజ్ వెళ్లిన వెంటనే భవానీపురం పోలీసులు స్పందించి..



నిమిషాల్లోనే లొకేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లు సీఎం జగన్ నిర్ణయాలతో మహిళలకు నిజమైన స్వేచ్ఛ వచ్చింది అన్నారు. జగనన్న లాంటి ముఖ్యమంత్రిని తాము ఎక్కడా చూడలేదని తెలిపారు. నేరం జరగడానికి ముందే దాన్ని నియంత్రించడం గొప్ప చర్య అన్నారు వాలంటీర్లు. ఇక ఇప్పటికే 17 లక్షల మంది దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని, స్మార్ట్ ఫోన్ ఉండే ప్రతి మహిళ వద్ద దిశ యాప్ ఉండాలని సీఎం జగన్ చెప్పారు.

## చంద్రబాబు దొంగ దీక్షలను ప్రజలు నమ్మరు: ఆళ్ల నాని

**సీఎం జగన్‌పై బురద జల్లేందుకే చంద్రబాబు కుట్రలు**

**మంత్రి ఆళ్ల నాని**

అమరావతి: చంద్రబాబు రోజురోజుకు దిగజారిపోతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో



మాట్లాడుతూ, చంద్రబాబు దొంగ దీక్షలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కరోనా పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని.. చంద్రబాబు, లోకేష్ మాత్రం జూమ్‌లో కాలక్షేపం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.కరోనా నివారణ చర్యల్లో ఏపీ ప్రభుత్వం.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఐసీఎంఆర్ ప్రొటోకాల్స్ తెలియకుండా చంద్రబాబు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'సీఎం జగన్‌పై బురద జల్లేందుకే చంద్రబాబు కుట్రలు అంటూ మంత్రి ఆళ్ల నాని నిప్పులు చెరిగారు.

## ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కన్నబాబు

**ఖర్చు చేసే ప్రతి రూపాయి పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి**

**కేంద్ర ప్రాయోజిత పథకాలపై మంత్రి కురసాల కన్నబాబు సమీక్ష**



అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాలపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖల సిబ్బంది, ఉన్నతాధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయంపై మంత్రి పలు సూచనలు చేశారు. ఖర్చు చేసే ప్రతి రూపాయి పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని కన్నబాబు పేర్కొన్నారు.రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా మిషన్(ఆర్‌కేవీవై), జాతీయ వ్యవసాయ స్వావలంబన(ఎన్ఎంఎస్ఎం), ప్రధాన మంత్రి క్రిషి సంచాయి యోజన పథకాల(ఎన్ఎంఎస్ఏ) రైతాంగానికి మేలు చేసే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాల వారిగా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, ఇతర అంశాలను మంత్రికి అధికారులు వివరించారు.గ్రామాల్లో రైతులకు రసాయనాలు, పురుగు మందుల వినియోగం తగ్గించేలాఅవగాహనాపెంచాలని మంత్రి అన్నారు.వ్యవసాయ,ఉద్యానవనశాఖలు, వ్యవసాయ, ఉద్యాన వన విశ్వ విద్యాలయాలతో సమన్వయం చేసుకొని రైతాంగానికి శాక్ష్మయ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కన్నబాబు సూచించారు.

## జూలై 19 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 19వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఆ సమావేశాలు ఆగస్టు 13వ తేదీ వరకు జరగనున్నాయి. వర్షాకాలసమావేశాల తేదీలను ఇవాళ పార్లమెంట్ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించింది.కరోనా నేపథ్యంలోకోవిడ్ ప్రవర్తనానియమావళి ప్రకారంసభా వ్యవహారాలను సాగించనున్నారు. సుమారు నెల రోజుల పాటు సాగే సమావేశాల్లో 20 సిట్టింగ్స్ ఉండనున్నాయి.సాధారణంగా వర్షాకాల సమావేశాలు జూలై మూడవ వారంలో ప్రారంభమై.. స్వాతంత్ర్య దినోత్సవం లోపు పూర్తి అవుతాయి. కనీసం ఒక డోసు కోవిడ్ టీకా తీసుకున్న వారిని పార్లమెంట్‌లోకి ఎంటరయ్యే అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది.

## వాహన మిత్ర స్కీమ్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న వైఎస్సార్ వాహన మిత్ర పథకం అమలుపై ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ వాహన మిత్ర స్కీమ్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తిరుపతి చెందిన బీజేపీ నేత భానుప్రకాష్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. రాజకీయ లబ్ది కోసమే దేవాదాయశాఖ నిధులను ఖర్చు చేశారని పిటిషనర్లు వాదనలు వినిపించారు. దేవాదాయశాఖ చెందిన 49 లక్షల రూపాయలను వాహన మిత్రకు మంజూరు చేయడం చట్టవిరుద్ధమని లాయర్ పేర్కొన్నారు. వాహన మిత్రకు దేవాదాయశాఖ నిధులు ఖర్చు చేయవద్దని జూలై 5 వరకు మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఇచ్చింది.

# సంపాదకీయం

బుధవారం 30 జూన్ 2021

## ప్రాంతీయ పార్టీలు కుటుంబ పార్టీలు గా మారిపోయాయి


ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలను, స్థానిక నాయకుల ప్రాధాన్యతను జాతీయ పార్టీలు విస్మరించడమే ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి ప్రధాన కారణం. తొలి రోజుల్లో ప్రాంతీయ పార్టీలు తమ రాష్ర్టాల ప్రగతికి దోహద పడ్డాయి. కాలక్రమంలో ఇవి కుటుంబ పార్టీలు, కుల పార్టీలు, మత పార్టీలుగా ముద్రపడిపోయాయి. పార్టీ అధినేత తదనంతరం అతని వారసులు పగ్గాలు చేపట్టడం సంప్రదాయంగా మారింది. అధినేతల కుటుంబ సభ్యులు చక్రం తిప్పడం ఆనవాయితీగా మారింది. అధినేత కుమారుడు, కూతురు, భార్య అల్లుడు, మేనల్లుడు, ఇతర సమీప బంధువులదే పెత్తనం. అధినేత తరఫున వ్యవహారాలు చక్కబెట్టడం, కీలక పదవులు దక్కించుకోవడం ప్రాంతీయపార్టీల్లో సహజ పరిణామం. తెలుగుదేశం, తెరాస, వైసీపీ, అకాలీదళ్, డీఎంకే, సమాజ్ వాదీ వంటి ప్రాంతీయ పార్టీల సమకాలీన చరిత్ర ఇది. ఇప్పుడు మమతా బెనర్జీ సారథ్యంలోని తణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కూడా పూర్తిగా ఇదే కోవలో ప్రయాణిస్తోంది. పార్టీ వ్యవస్థాపకురాలు అవివాహిత. మూడోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఆమె తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు అభిషేక్ బెనర్జీని తెరపైకి తీసుకువచ్చారు. నిన్న మొన్నటి దాకా కోల్ కతా కే పరిమితమైన అభిషేక్ బెనర్జీ ఇక నుంచి హస్తిన కేంద్రంగా రాజకీయం నెరపనున్నారు. ఇటీవల ఆయనను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన నియామకాన్ని పార్టీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇప్పటివరకు మేనత్త మమత తరఫున రాష్ట్రంలో పార్టీ వ్యవహారాలను చక్కబెట్టిన అభిషేక్ బెనర్జీ కార్యక్షేత్రం ఇకపై ఢిల్లీకి మారనుంది. ఇప్పటివరకు పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా అభిషేక్ బెనర్జీ పనిచేస్తున్నారు. 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్ నియోజకవర్గం నుంచి రెండోసారి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొదటిసారి 2014లో మూడు లక్షల ఇరవై వేలకు పైగా మెజార్టీతో ఎన్నికైన ఆయన మెజార్టీ రెండోసారి 2019నాటికి 1,20,594కు మాత్రమే పరిమితమైంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి తెరవెనక అభిషేక్ బెనర్జీ విశేష కృషి ఉంది. ఒకప్పటి పార్టీ నాయకుడు 2017లో భారతీయ జనతా పార్టీలో చేరిన ముకుల్ రాయ్ ను మళ్లీ పార్టీలోకి తీసుకురావడం వెనక అభిషేక్ బెనర్జీ ప్రయత్నం ఉంది. వాస్తవానికి పార్టీలో పెరిగిపోతున్న అభిషేక్ ప్రాధాన్యాన్ని జీర్ణించుకోలేకే పలువురు సీనియర్ నాయకులు ఎన్నికలకు ముందు కమలం పార్టీకి క్యూ కట్టారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వెంటనే అభిషేక్ బెనర్జీ ఎన్నికల సమయంలో బీజేపీ దాడుల్లో దెబ్బతిన్న కార్యకర్తలను పరామర్శించారు. ముర్షీదాబాద్ జిల్లాలోని బెహ్రాంపూర్, రఘునాథ్ గంజ్, బంకూర తదితర ప్రాంతాల్లో పర్యటించి పార్టీ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపారు. ఇక మమత తన పరిధిని జాతీయస్థాయికి విస్తరించాలనుకుంటున్న నేపథ్యంలో ఆయన ఢిల్లీలో లాబీయింగ్ చేయనున్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేసే పనిలో నిమగ్నం కానున్నారు. 2024 నాటికి కాంగ్రెస్ తో సహా అన్ని ప్రాంతీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడం, దానికి మమత సారథ్యం వహించేలా చేయడం తద్వారా మమత ప్రధాని అయ్యేందుకు మార్గం సుగమమం చేయడం అభిషేక్ బెనర్జీ ముందున్న తక్షణ కర్తవ్యం. ఎంబీఏ చదివిన అభిషేక్ బెనర్జీకి ఆంగ్లంపై పట్టు, జాతీయ రాజకీయాలపై మంచి అవగాహన ఉంది. మమత మేనల్లుడిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. హస్తిన రాజకీయాల్లో రాణించడానికి ఆయనకు ఇవి దోహదపడతాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, జులైలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ,ఏడాది చివర్లో జరగనున్న గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో మమతను ప్రచారానికి దించడం ద్వారా జాతీయ రాజకీయాల్లో ఆమె పాత్రను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా అభిషేక్ బెనర్జీ పని చేస్తున్నారు.

# రాజకీయ వ్యూహాలే అవసరం...

గుంటూరు, జూన్ 29, (న్యూస్ పల్స్)అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదు అన్నది ముతక సామెత. కేంద్రంలోని ప్రభుత్వం అమ్మ అనుకుంటే రాష్ట్రాలు పిల్లలే. ఇక అమ్మకు అందరు బిడ్డలూ సమానమే, అయితే కొందరు మాత్రం ముద్దు బిడ్డలు. బీజేపీకి ఉత్తరాది పార్టీ అన్న పేరు ఉంది. దానికి తగినట్లుగానే దక్షిణాది మీద వివక్ష కూడా కొనసాగుతోందని చాలా మంది నాయకులు ఇప్పటికే ఆడిపోసుకున్నారు. అయినా కేంద్రం బేఖాతర్ అన్నట్లుగానే ఉంది. నాలుగు ఓట్లు ఎక్కడ ఉంటే అక్కడే అన్నం వడ్డిస్తోంది. మరి ఏపీ లాంటి చోట ఎప్పటికీ ఖాళీ కంచమేనా. జగన్ ప్రత్యేక హోదా విషయంలో నిరాశలో ఉన్నట్లుగా కనిపిస్తోంది. పైగా ఆయన టీడీపీని తప్పుపడుతున్నారు. కానీ ఆయన చేయాల్సింది ఇక్కడ చాలానే ఉంది అన్నది మేధావుల మాట. కేంద్రం మెడలు వంచుతామని విపక్షంలో ఉన్నపుడు జగన్ చెప్పారు. అప్పటికే ఆయన మీద సీబీఐ కేసులు ఉన్నాయి. మెడలు వంచడానికి నాడు లేని భయం నేడు ఎందుకు వస్తుంది. అంటే జగన్ మరో మాట చెబుతున్నారు. కేంద్రానికి మన అవసరం లేనంతంగా ఎంపీల మద్దతు ఉంది అని. అది కరెక్టే. కానీ లోక్ సభలో మాత్రమే బీజేపీ బలంగా ఉంది. రాజ్యసభలో ఆ పార్టీ ఇప్పటికీ మైనారిటీలోనే ఉంది. ఈ రోజుకు 93 మంది రాజ్యసభ సభ్యులు బీజేపీకి ఉన్నారు. వచ్చే ఏడాదికి ఆ నంబర్ 75కి తగ్గిపోతుంది. అదే సమయంలో జగన్ బలం పెరుగుతుంది. అంటే జగన్ అవసరం బీజేపీకి ఇంకా పెరిగినట్లే కదా. జగన్ గత రెండేళ్ళుగా బేషరతుగానే మద్దతు ఇస్తూ వచ్చారు. మరి మద్దతు కోరే పార్టీకి ప్రత్యేక హోదా డిమాండ్ ఎందుకు పెట్టడం లేదు అన్నదే ఇక్కడ ప్రశ్న. హోదా విషయంలో కేంద్రాన్ని అడుగుతూనే ఉంటామని జగన్ అంటున్నారు. ఆ విషయం ఆయన చేస్తున్నది కేవలం విన్నపం మాత్రమే. విన్నపాలకు మోడీ సర్కార్ కరుగుతుంది అని ఎవరూ అనుకోరు. మరి జగన్ కేంద్రంతో సఖ్యతగా ఉండి కూడా మిగిలిన రాష్ట్రాల కంటే కూడా తక్కువ వాక్సినే పొందగలిగారు. నిధుల విషయంలోనూ ఉత్త చేయే చూపిస్తోంది. పోలవరం ప్రాజెక్ట్ సవరణ బడ్జెట్ ని కేంద్రం ఆమోదించలేదు. అంటే వియ్యంతో జగన్ రెండేళ్ళలో ఏమీ సాధించలేకపోయారు అన్నది తెలిసిపోతోంది. అందుకే కయ్యంతోనే సాధించాలేమో అన్న సూచన కూడా వస్తోంది. కయ్యం అంటే మరీ చంద్రబాబు లాగా అన్నీ తెంచేసుకోవడం కాదు, రాజ్యసభలో బీజేపీ అవసరాలను అడ్డం పెట్టుకుని బ్రేకులు వేయాలి. తమకు హోదా సహా విభజన హామీలు ఇస్తే రాజ్యసభలో మద్దతు ఉంటుందని గట్టిగా చెప్పగలగాలి. కేంద్రానికి ఎపుడు పూర్తి మెజారిటీ వస్తుందో. మరెపుడు సంకీర్ణ ప్రభుత్వం ఉంటుందో ఎవరైనా ఊహించగలరా. ఆలా అనుకుని డిమాండ్లు

వాయిదా వేసుకోగలరా. జగన్ అనుకున్నట్లుగానే రేపటి రోజున బీజేపీకి కానీ యూపీయే కి కానీ పూర్తి మెజారిటీ రాక సంకీర్ణ ప్రభుత్వాలే ఏర్పడ్డాయి అనుకుందాం. అపుడు కేంద్రంలోని పెద్దలు ప్రత్యేక హోదా ఇస్తామంటే అడ్డు పెట్టేందుకు అదే సంకీర్ణం లోని ఇతర పార్టీలు రెడీ అయితే హోదా ఎక్కడికి పోతుంది అన్నది కూడా ప్రశ్నేగా. ఇక ఢిల్లీల్లోని కేజ్రీవాల్, బెంగాల్ లోని మమతా బెనర్జీ, తమిళనాడు స్టాలిన్ వంటి వారు కేంద్రంతో సఖ్యత లేకుండా తమ డిమాండ్లు ఎలా సాధించుకుంటున్నారు. అంటే రాజకీయ వ్యూహాలతో కూడిన పోరాటం అవసరమని తేలుతున్న సత్యం. అందువల్ల జగన్ బీజేపీ ని అర్థించే కంటే అదిలించి బెదిరించే స్థితికి చేరుకుంటే చిటికలో హోదా వచ్చి తీరుతుంది. అయితే ఈ మార్గంలో ఎన్నో రిస్కులు ఉన్నాయి. జగన్ మీద కేసులు ఉన్నందువల్ల బీజేపీ పెద్దలు ఏమైనా చేస్తారు అన్నది కూడా అంతా ఊహిస్తారు. కానీ జనం కోసం బీజేపీ మెడలు వంచిన నాడు జగన్ ఇమేజ్ ఇంకా పెరుగుతుంది తప్ప తగ్గదు, అపుడు కక్ష సాధింపు చర్యలు ఎవరు చేపట్టినా జగన్ చేతిలో చిత్తు కాక తప్పదు.

# రఘురామ సక్సెస్ అయినట్టేనా



ఏలూరు, జూన్ 29, (న్యూస్ పల్స్)రాజకీయంగా ప్రత్యర్థులు వేసే ఎత్తులకు పై ఎత్తులైనా.. వేయాలి.. లేదా.. వాటికి దూరంగా అయినా ఉండాలి. ఈ విషయంలో సీఎం జగన్ వ్యవహారం.. రెండోదే., ఆయన పెద్దగా రియాక్ట్ కారు. ఎవరు ఏమని అన్నా.. ఎన్ని విమర్శలు చేసినా.. ఆయన చలించరు. గత ఎన్నికలకు ముందు.. నుంచి ఇప్పటి వరకు జగన్ పంథానే వేరు. ఎవరు ఏమని అనుకున్నా..తాను చేయాల్సింది చేస్తారు. ప్రతిపక్ష నేతలు ఎంతగా రెచ్చగొట్టినా.. ఎన్నివ్యాఖ్యలు చేసినా. జగన్ తాను చేయాలని అనుకున్నదే చేస్తున్నారు. ఇక, సొంత పార్టీ ఎంపీ.. రఘురామ కృష్ణరాజు.. ప్రత్యర్థుల కంటే కూడా ఎక్కువగా విమర్శలు గుప్పించారు. ఇప్పటికీ గుప్పిస్తూనే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం.. తనకు గుర్తింపు లేదనే కారణం కావొచ్చు.. లేదా.. పార్టీలో తాను జగన్ తర్వాత జగన్ రేంజ్‌లో తనకు ప్రాధాన్యం కావాలని భావించి ఉండొచ్చు. అయితే.. ఆ రేంజ్ ఇచ్చేందుకు జగన్ ఎందుకు ఒప్పుకుంటారు ? ఒప్పుకోరు. గతంలోనూ బీజేపీలో ఉన్న రఘురామ కృష్ణరాజుకు కేంద్రంలోని బీజేపీ నేతల దగ్గర మంచి పలుకుబడి ఉన్న మాట వాస్తవం. దీంతో రాష్ట్ర అవసరాల కోసం.. జగన్ తనపై ఆధారపడి ఉంటే బాగుంటుందని.. ఆయన భావించి ఉండొచ్చు. కానీ, రాష్ట్రపార్టీ అధినేత..జగన్.. ఆ అవకాశం ఎందుకు ఇస్తారు. ఇదే రఘురామ కృష్ణరాజుకు వైసీపీకి మధ్య తేడా రావడానికి కారణంగా ఉందని అంచనాలు ఉన్నాయి. సరే? ఏదేమైనా.. వైసీపీని టార్గెట్ చేస్తూ రఘురామ కృష్ణరాజు వ్యాఖ్యలు సంధిస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ అధినేత జగన్‌పై కసి తీర్చుకోవాలనేది రఘురామ కృష్ణరాజు లక్ష్యం అనే విషయం స్పష్టమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో అంటే.. సీఐడీ కేసు నమోదు తర్వాత.. మరింత వేగం పెంచారు. జగన్ బెయిల్ రద్దు కోరుతూ.. కేసు వేయడం.. ఆయన వ్యాపారాలను టార్గెట్ చేయడం తెలిసిందే. ఇక.. అప్పటి వరకు అంటే.. దాదాపు ఏడాది కాలంగా రఘురామ కృష్ణరాజు విషయంలో పెద్దగా జోక్యం చేసుకోని ..జగన్.. ఇటీవల కాలంలో ఆయన విషయంలో సీరియస్‌గానే స్పందిస్తున్నట్టు కనిపిస్తోంది. ఇదే.. రఘురామ కృష్ణరాజు కూడా కోరుకున్నది. అంటే.. తన విషయంలో జగన్ రెచ్చిపోయి.. అంతిమంగా.. కేంద్రంలోని బీజేపీతో జగన్‌కు ఉన్న సన్నిహితత్వం తెగిపోవాలనే రఘురామ తాపత్రయ పడుతున్నారా ? అన్న సందేహం కూడా ఉంది. రఘురామ కృష్ణరాజు ఎప్పటి నుంచో కోరుకుంటున్నా.. ఇప్పుడు జగన్ స్పందిస్తున్న తీరు.. ఇక, రఘురామ సక్సెస్ అవుతున్నట్టేనని అంటున్నారు పరిశీలకులు. ఇటీవల ఢిల్లీలో సీఎం జగన్.. అమిత్ షాను కలుసుకుని వచ్చిన తర్వాత అనూహ్యంగా.. కేంద్రంపై జగన్ వైఖరి మారినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ఎంపీ రఘురామ కృష్ణరాజు సభ్యత్వాన్ని రద్దు చేయాలని.. తాము లేఖ సమర్పించి.. నెలలు గడుస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదంటూ విజయసాయిరెడ్డి ఏకంగా స్పీకర్‌కు లేఖరాయడం సంచలనంగా మారింది. అదే సమయంలో మారిటోరియం బోర్డు విషయంలో ఎంతకైనా వెళ్తామని.. పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి పేర్కొనడం.. వంటివి కేంద్రంతో అమీతుమీకి జగన్ రెడీ అవుతున్నారన్న సంకేతాలు వస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. వీటి వెనుక.. రఘురామ కృష్ణరాజు చేస్తున్న వ్యాఖ్యలు.. తద్వారా.. ఆయనపై చర్యలు తీసుకోవడం లేదనే అక్కసుతో జగన్.. ఆయన ట్రాప్‌లో చిక్కుకుని కేంద్రంలోని బీజేపీతో సై! అంటున్నారని చెబుతున్నారు విశ్లేషకులు. మరి ఇదే జరిగి..కేంద్రంతో కటీఫ్ అయితే.. రఘురామ కృష్ణరాజు లక్ష్యం నెరవేరినట్టేనని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# హౌసింగ్ గ్రౌండ్ అయ్యేది ఎప్పుడూ

నెల్లూరు, జూన్ 29, (న్యూస్ పల్స్)నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన లబ్ధిదారులు వారి గృహ నిర్మాణాలకు శంకుస్థాపనలు వేగవంతమయ్యేందుకు జులై 1, 3, 4 తేదీల్లో 'హౌసింగ్ గ్రౌండింగ్ మేళా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులకు ఆదేశాలిచ్చింది. గ్రౌండింగ్ ప్రక్రియ జులై 9లోగా ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని ఇటీవల సిఎం వైఎస్ జగన్ గృహ నిర్మాణశాఖ సమీక్షలో పేర్కొన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. శంకుస్థాపనలు పూర్తి చేసి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఇంకా 12 రోజులే మిగిలి ఉండటంతో అధికారులు పనిలో నిమగమయ్యారు. మొదటి విడతకు సంబంధించి 15.60 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కోర్టుల్లో కేసుల నేపథ్యంలో 14.50,425 లక్షల ఇళ్లు, జిల్లాల వారీ టార్గెట్లు ఫిక్స్ చేశారు. ఇందులో సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకున్నవారు 96,136 లబ్ధిదారులుండగా, ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో గ్రౌండింగ్ అయిన ఇళ్ల సంఖ్య 2,76,649 ఉన్నట్లు సమాచారం. మిగిలిన 12 లక్షలకు పైగా ఇళ్లకు జులై 9లోగా శంకుస్థాపనలు జరుగుతాయా? అనే ప్రశ్న ఉద్భవిస్తోంది. ఇళ్ల నిర్మాణ శంకుస్థాపనలు స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్లాలని ఆదేశాలుండటంతో అధికారులు లే అవుట్ల ప్రాంతాలను సందర్శించే పనిలో పడ్డారు. ప్రభుత్వం నూరు శాతం లక్ష్యాలను అధిగమించాలని భావిస్తున్నప్పటికీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల్లో గృహాలు నిర్మించుకునేం దుకు ఆశించిన మేర లబ్ధిదారులు ముందుకు రావడం లేదని నిఘా వర్గాలు ప్రభుత్వానికి సమాచారాన్ని అందించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణాలకు ముందుకు రాని లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ఆయా జిల్లాల్లోని పరిస్థితులను బట్టి గృహ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.1.80 లక్షల యూనిట్ వ్యయానికి తోడు డ్వాక్రా (ఎస్‌హెచ్‌జి) లింకేజీ ద్వారా రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు అడ్వాన్స్ రుణాలు లబ్ధిదారులకు అందేలా సంబంధిత అధికారులు బ్యాంకులతో టయప్ చేయాలని ప్రభుత్వం తాజాగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇళ్లకు కేటాయించిన స్థలాలు ఎక్కడో విసిరేసినట్లుగా ఉండటంతో ఆ ప్రాంతానికి చేరుకునేందుకు ప్రత్యేక బస్సుల ద్వారా లబ్ధిదారులకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం జిల్లాల అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం నూరు శాతం గ్రౌండింగ్ చేయాలని భావిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కానరావడం లేదని మండల స్థాయిలోని అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

# విస్తీర్ణం పెరిగినా పెరగని దిగుబడి

కాకినాడ, జూన్ 29, (న్యూస్ పల్స్)నిరుడు ఖరీఫ్ వరి ఉత్పాదకత నవ్యాంధ్ర ఏర్పడ్డాక ఏడేళ్లల్లో కనిష్టంగా నమోదైంది. ఉత్పత్తి రెండవ కనిష్ఠంగా రికార్డయింది. 2020-21 ఖరీఫ్, రబీ పంటల సాగు, ఉత్పత్తి, ఉత్పాదకతలపై ప్రభుత్వం నాల్గవ ముందస్తు అంచనాలు రూపొందించగా, గతేడాది ఖరీఫ్‌లో వరి దిగుబడులకు భారీగా దెబ్బ తగిలిందని వెల్లడైంది. తుపాన్లు, అధిక వర్షాలు, వరదలు, కరువు, కరోనా అన్నీ కట్టకట్టుకొని దాడి చేసిన ఫలితంగా వరి ఉత్పాదకత ఏడేళ్లల్లోకెల్లా కనిష్టానికి క్షీణించింది. మొన్న బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక సర్వేలో మూడవ ముందస్తు అంచనాల ప్రాతిపదికన వరి ఉత్పత్తి, ఉత్పాదకతలను పేర్కొనగా, రెండు మాసాల అనంతరం వేసిన నాల్గవ ముందస్తు అంచనాలో సర్వేలో చెప్పిన దాని కంటే తగ్గింది. మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గుదలకు కారణమైంది. నిరుడు ఖరీఫ్‌లో వరి 15.98 లక్షల హెక్టార్లలో సాగవుతుందని, 81.48 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి లభిస్తుందని, ఉత్పాదకత హెక్టారుకు 5,099 కిలోలని ఆగస్టులో వేసిన తొలి అంచనాల్లో తెలిపారు. మరలా డిసెంబర్‌లో వేసిన రెండవ అంచనాల్లో 16.01 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుందని విస్తీర్ణాన్ని స్వల్పంగా పెంచి, దిగుబడిని మాత్రం 72.37 లక్షల టన్నులకు, ఉత్పాదకతను 4,520 కిలోలకు తగ్గించారు. బడ్జెట్‌కు ముందు మార్చిలో వేసిన మూడవ అంచనాల్లో విస్తీర్ణాన్ని 16.90 లక్షల హెక్టార్లకు పెంచి, దిగుబడి దగ్గర కొచ్చేసరికి మరోమారు 71.37 లక్షల టన్నులకు, ఉత్పాదకతను 4,223 కిలోలకు తగ్గించారు. జూన్‌లో వచ్చిన నాల్గవ అంచనాల్లో విస్తీర్ణాన్ని తిరిగి 16.01 లక్షల హెక్టార్లకు తగ్గించి, ఉత్పత్తిని 67.61 లక్షల టన్నులకు తగ్గించారు. ఉత్పాదకత మూడవ అంచనాల్లో పేర్కొన్న అంకెను పేర్కొన్నారు. నవ్యాంధ్ర ఏర్పడ్డాక ఏడు ఖరీఫ్ సీజన్లు రాగా ఇప్పుడే ఉత్పాదకత కనిష్టంగా నమోదైంది.

# ఫైర్ బ్రాండ్ లు సైలెన్స్

అనంతపురం, జూన్ 29, (న్యూస్ పల్స్) రాజకీయ పార్టీకి అయినా.. ఫైర్ బ్రాండ్లు అవసరం. ప్రత్యర్థి పార్టీలు, నేతల నుంచి వచ్చే విమర్శలకు చెక్ పెట్టేందుకు కొందరు నేతలను అన్ని పార్టీలూ వాడుకుంటుంటాయి. ఆ పార్టీ ఈ పార్టీ అనేతేడా లేకుండా ఫైర్ బ్రాండ్లకు అన్ని పార్టీలూ ప్రాధాన్యం ఇస్తుం టాయి. వీరిని ప్రోత్సహిస్తుంటాయి కూడా. ఇలా? టీడీపీ అధినేత చంద్రబాబు చాలా మంది ఫైర్ బ్రాండ్లను ప్రోత్సహించారు. వీరిలో బుద్దా వెంకన్న, బీటెక్ రవి, పోతుల సునీత (ఈమె పార్టీ మారారు), వైవీబీ రాజేంద్ర ప్రసాద్ సహా అనేక మంది నేతలను ప్రోత్సహించారు. వీరిలో గెలుస్తారు.. అనుకున్నవారికి ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చారు. ఇక, గెలవని వారిని పక్కన పెట్టకుండా.. మండలికి పంపారు. ఇదంతా కూడా చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిందే. ఇది చంద్రబాబుకు గత రెండేళ్లపాటు కలిసి వచ్చింది. మండలిలో అడుగు పెట్టిన టీడీపీ ఫైర్ బ్రాండ్లు.. వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల నిర్ణయం.. సీఆర్డీయే రద్దు నిర్ణయం.. సహా.. జగన్ తీసుకున్న రంగుల నిర్ణయం వంటివాటిపై మండలిలో తీవ్రస్థాయిలో వాయిస్ వినిపించారు. దీంతో అటు అసెంబ్లీలో టీడీపీకి వాయిస్ లేకపోయినా మండలిలో అయినా.. పార్టీ బతికిందనే టాక్ వినిపించింది. చివరకు ఇది 151 మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌కే తీవ్ర అసహనం తెప్పించింది. తాను ఇంత భారీ మెజార్టీతో ముఖ్యమంత్రిని అయితే ఈ గందరగోళం ఏంటని ఆయన తీవ్ర ఆగ్రహంతో మండలినే రద్దు చేయాలన్న సంచలన నిర్ణయం తీసుకునే వరకు వెళ్లింది. అయితే..ఇప్పుడు చాలా మంది టీడీపీ ఎమ్మెల్సీలు రిటైరయ్యారు. మండలి నుంచి కీలకమైన ఫైర్ బ్రాండ్లుగా ఉన్న బుద్దా వెంకన్న, బీటెక్ రవి, వైవీబీ రాజేంద్ర ప్రసాద్.. సహా పలువురు రిటైర్ అయిపోయారు. దీంతో మండలిలో టీడీపీ తరఫున గట్టివాయిస్ వినిపించేవారి సంఖ్య చాలా వరకు తగ్గిపోయింది. బయట ఎంత వాయిస్ వినిపించినా.. శాసనసభ, మండలిలో గట్టి వాయిస్ వినిపిస్తూ.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే నేతలు.. టీడీపీ ఇప్పుడు చాలా అవసరం. శాసనసభలో ఉన్నదే 23 మంది.. అందులోనూ నలుగురు పార్టీ వీడారు. ఇక ఉన్న 19 మందిలో ఆరేడుగురు ఎమ్మెల్యేలు అసలు నోరు విప్పరు. ఇలాంటి పరిస్థితుల్లో తమ బలమైన వాయిస్ వినిపించే అవకాశం ఉన్న మండలిలోనూ ఇప్పుడు ఆ ఛాన్స్ లేకుండా పోయింది. ఇప్పుడు ఇక్కడ కూడా టీడీపీకి సంఖ్యాబలం తగ్గుతుండడంతో పార్టీలో ఒకవిధమైన నైరాశ్యం కనిపిస్తుండడం గమనార్హం

# వైసీపీలో సీనియర్లు గుస్సా

విజయవాడ, జూన్ 29, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో 2019లో అధికారం కోల్పోయిన తర్వాత.. టీడీపీ నుంచి నేతలు.. అధికార వైసీపీ వైపు మొగ్గు చూపిన విషయం తెలిసిందే. సీనియర్లు, జూనియర్లు.. భారీ సంఖ్యలో టీడీపీని విడిచి పెట్టారు. ఇక, టీడీపీ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు.. కూడా నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీకి మద్దతుగా మారారు. ఇది ఇప్పటి వరకు తెలిసిందే. ఇక గత ఎన్నికల్లో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన నేతలు కూడా ఓడిపోయారు. వైసీపీ వాళ్లు రెండేళ్లుగా త్వరలోనే టీడీపీ ఖాళీ అవుతుందని చెపుతూనే ఉన్నారు. అయితే.. టీడీపీ నేతలు ఆసక్తి కర ప్రచారం చేస్తున్నారు. మా పార్టీ నుంచే ఇప్పటి వరకు వలసలు ఉన్నాయని.. కానీ, త్వరలోనే వైసీపీ నుంచి కూడా వలసలు ఉంటాయని వారు అంటున్నారు. ఇక, ఇదే విషయాన్ని టీడీపీ అనుకూల మీడియా కూడా ప్రచారం చేస్తోంది. మరి దీనిలో నిజమెంత ? అనే విషయాన్ని పరిశీలిస్తే.. ప్రస్తుతం వైసీపీలో చాలా మంది నేతలు.. పనిలేకుండా ఖాళీగా ఉన్నారనేది వాస్తవం. గతంలో చంద్రబాబు పాలన సాగినప్పుడు ఓడిపోయిన నేతలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. వారికి కాంట్రాక్టులు, ఇతర పనులు అప్పగించడం ద్వారా సంతృప్తి పరిచారు. కానీ, ఇప్పుడు వైసీపీలో ఆ తరహా పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఓడిపోయిన వారు..సీనియర్లు అసంతృప్తితో ఉన్నారు. అంతెందుకు గెలిచిన వాళ్లలోనే చాలా మందికి ప్రయార్టీ లేదన్నదీ వాస్తవమే..!దీనికితోడు..గత ఎన్నికల సమయంలో కొంత మందిని పోటీ నుంచి స్వయంగా జగనే తప్పించారు. వీరికి పదవులు ఇస్తామని.. పార్టీలో గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే.. ఇప్పటి వరకు చాలా మందిని పక్కన పెట్టారు. ఇలాంటి వారు కూడా రుసరుస లాడుతున్న విషయం వాస్తవమే. అయితే.. వీరంతా వైసీపీని వదిలేస్తారా ? అనేది మాత్రం సందేహమే. ఎందుకంటే.. టీడీపీలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు తర్వాత ఎవరు పార్టీని లీడ్ చేస్తారు? అనే విషయంలో క్లారిటీ లేదు. ఇక, లోకేష్‌పై ఇప్పుడున్న టీడీపీ నేతలకే నమ్మకం లేదు. దీంతో వైసీపీలో అసంతృప్తి సెగలు కక్కుతున్న నేతలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వారికి ఇష్టమైనా, కష్టమైనా పార్టీలో ఉంటే కనీసం అధికార పార్టీలో ఉన్నామని చెప్పుకునేందుకు అయినా వీలుంటుంది. సో.. దీనిని బట్టి వైసీపీ నుంచి నేతల వలసలు ఉంటాయనే ప్రచారం కేవలం బూమ్ కోసమే తప్ప మరొకటి కాదన్నదే వాస్తవం

# రెండు విధాలా కమలానికి నష్టమే

విజయవాడ, జూన్ 29, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ ఇటు రెండు విధాలుగా ఇబ్బంది పడుతుంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలసి వెళుతుందన్న ప్రచారం ఒకవైపు, లేదు వైసీపీతో సఖ్యతగానే ఉంటుందన్న వార్తలు మరోవైపు ఆ పార్టీని రాజకీయంగా ఇబ్బంది పెడుతున్నాయి. దీంతోబీజేపీ నేతలు టోన్ పెంచారు. అధికార వైసీపీ, విపక్ష టీడీపీలపై విరుచుకుపడుతున్నారు. ప్రజల్లో ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా ఉండేందుకు ఏపీ బీజేపీ నేతలు ఇటీవల కాలంలో తంటాలు పడుతున్నారు. నిన్న మొన్నటి దాకా బీజేపీ నేతలు తెలుగుదేశం పార్టీపై విరుచుకుపడేవారు. చంద్రబాబు పాలన జరిగిన తప్పులను ఎత్తి చూపేవారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో టీడీపీ కలుస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. దీనికితోడు చంద్రబాబు సయితం అదే రకమైన సంకేతాలు పంపుతున్నారు. మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయకపోవడం, మహానాడులో కేంద్రప్రభుత్వానికి మద్దతు ఇస్తామని ప్రకటించడం కూడా రాష్ట్ర బీజేపీని ఇరకాటంలో పడేశాయి. అందుకే తాము ఎట్టి పరిస్థితుల్లో టీడీపీతో పొత్తుపెట్టుకునే పరిస్థి?తి లేదని బీజేపీ నేతలు పదే పదే చెప్పుకోవాల్సి వస్తుంది. ఇదిలా ఉంటే వైసీపీ కూడా తమ ఎదుగుదలకు అడ్డంకిగా మారిందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఇటీవల జగన్ ఢిల్లీ పర్యటన తర్వాత కేంద్ర ప్రభుత్వం జగన్ కు అనుకూలంగా ఉందన్న సంకేతాలు బలంగా వచ్చాయి. జగన్ సహకారం కోసం బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రయత్నిస్తుందన్న ప్రచారమూ ఉంది. దీంతో వైసీపీతో కూడా రాజకీయంగా తమకు ఇబ్బందులు వస్తాయని బీజేపీ రాష్ట్ర నాయకత్వం భావిస్తుంది. ఇటీవల కాలంలో వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతుంది. రైతు సమస్యలపై నేరుగా ఆందోళనకు దిగింది. ప్రొద్దుటూరులో టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటుపై రచ్చ చేసింది. ఎప్పుడూ వైసీపీని ఒక మాట కూడా అనని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సయితం వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

# బద్వేలులో పోటీపై మీ మాంస

కడప, జూన్ 29, (న్యూస్ పల్స్)త్వరలో బద్వేలు ఉప ఎన్నిక జరగనుంది. ఆరు నెలల్లో బద్వేలు నియోజకవర్గం ఉప ఎన్నికను ఎన్నికల కమిషన్ నిర్వహించాల్సి ఉంది. కరోనా కారణంగా మరో నాలుగు నెలలు సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. అయితే బద్వేలు ఉప ఎన్నిక అనివార్యం. కడప జిల్లాలో ఉండటం 2009 నుంచి బద్వేలు నియోజకవర్గం అచ్చి రాకపోవడంతో చంద్రబాబు ఈ ఉప ఎన్నికపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికకు నాలుగు నెలల ముందే అభ్యర్థిని చంద్రబాబు ప్రకటించారు. పనబాక లక్ష్మి తమ అభ్యర్థి అని ఆయన ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో కూడా ఉత్సాహం ఏర్పడింది. తిరుపతి ఉప ఎన్నికల్లో ఓటమి పాలయినా పరువు పోకుండా ఓట్లు రావడం చంద్రబాబుకు ఊరటనిచ్చే అంశమే. అయితే బద్వేలు నియోజజకవర్గం ఉప ఎన్నికలో అలా జరిగే అవకాశం లేదని చంద్రబాబు తనకున్న నివేదికల ద్వారా తెలిసినట్లు చెబుతున్నారు. బద్వేలు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో తిరుపతి ఉప ఎన్నిక ఫలితమే రిపీట్ అవుతుందని, అక్కడ కనీస ఓట్లను కూడా సాధించే అవకాశం లేదని ఆయన తనకున్న వ్యవస్థల ద్వారా సమాచారం తెప్పించుకున్నారు. దీంతో చంద్రబాబు బద్వేలు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అన్న దానిపై డైలమాలో ఉన్నారు. పోటీ చేయకపోతే భయపడి వెనక్కు తగ్గినట్లు అవుతుందన్న ఆలోచన కూడా లేకపోలేదు. ఇప్పటికే జడ్పీటీసీ ఎన్నికలను చంద్రబాబు బహిష్కరించారు. బద్వేలు ఉప ఎన్నికను కూడా బహిష్కరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనను చంద్రబాబు చేస్తున్నట్లు తెలిసింది. అందుకే బద్వేలు ఉప ఎన్నిక గురించి ఎవరూ మాట్లాడవద్దని నేతలకు గట్టి వార్నింగ్ చంద్రబాబు ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల మహానాడులో కూడా ఆ ఉప ఎన్నిక గురించి ప్రస్తావన రాకుండా చంద్రబాబు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారంటున్నారు. మొత్తం మీద తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం బద్వేలు ఉప ఎన్నికలో మాత్రం లేదన్నది స్పష్టంగా తెలుస్తోంది.

# క్యాట్ ఫిష్ చెరువులు ధ్వంసం

ఒంగోలు ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఓబచెత్తవారి పాలెం లో కోళ్ల వ్యర్థాలతో షుమారు 50 ఎకరాలలో క్యాట్ ఫిష్ లను పెంచుతున్న చెరువులను మత్స్యశాఖ అధికారులు ధ్వంసం చేసారు. వివరాల్లోకి వెళితే జిల్లాలోని చీమకుర్తి మండలం ఓబచెత్తవారిపాలెం గ్రామ పరిసరాలలో కోళ్ల వ్యర్థాలతో షుమారు 50 ఎకరాలలో క్యాట్ ఫిష్ లను పెంచేందుకు చెరువులను తయారుచేసి తమ గ్రామ పరిసరాలు కలుషితం చేస్తున్నారన్న ఓబచెత్తవారిపాలెం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ప్రకాశంజిల్లా మత్స్యశాఖ అధికారులు పలు జేసీబీలతో ధ్వంసం చేసారు. ఈ క్యాట్ ఫిష్ ల పెంపకం నేరమని, అలా చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యుత్ షాక్ తో కూలి లంక వీరబాబు మృతి

రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం ములగపూడి గ్రామంలో విద్యుత్ షాక్ తగలడంతో లంక వీరబాబు అనే కూలి పని చేసుకునే ఈ వ్యక్తి మృతి చెందాడు కోటనందూరు ఎస్ఐ చెప్పిన వివరాల ప్రకారం రౌతులపూడి మండలం ములగపూడి గ్రామంలో కొరుప్రోలు అప్పలనాయుడు ఇంటి దగ్గర పనికి వెళ్లి ఇంటిక్రింద నుంచి ఒకరు ఐరన్ పోల్స్ అందిస్తుంటే అతను తీసుకునే క్రమంలో ఆ పోల్ వెళ్లి హై టెన్షన్ వైరు తగిలి మొదటి గాయాలయ్యాయి అతన్ని చికిత్స నిమిత్తం రౌతులపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలించగా అతను చనిపోయినట్లు నిర్ధారించారు పోస్టుమార్టం నిమిత్తం తుని గవర్నమెంట్ హాస్పిటల్ తరలించారు.

# ఇది చలనం లేని ప్రభుత్వం: ప్రత్తిపాటి పుల్లారావు



గుంటూరు జూన్ 29 వైసీపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది చలనం లేని ప్రభుత్వమన్నారు. సీఎం నివాసం నుండి బయటకు రారు... సమస్యలను పరిష్కరించరని మండిపడ్డారు. ప్రతిపక్షాల సూచనలు, సలహాలు పట్టించుకోరని వ్యాఖ్యానించారు. తెల్లరేషన్ కార్డు దారులకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కరోనాతో చనిపోయిన కుటుంబాలకు పదిలక్షలు ఇవ్వాలని, ఆక్సిజన్ అందక చనిపోయిన వారి కుటుంబాలకు ఇరవై ఐదు లక్షలు ఇవ్వాలని అన్నారు. ఆరోగ్య శ్రీని అటకెక్కించారని తెలిపారు. జగనన్న కాలనీలోని ఇళు ్ళ అగ్గిపెట్టెల్లా ఉన్నాయని వారి పార్టీ శాసనసభ్యులే అంటున్నారని చెప్పుకొచ్చారు. జగనన్న కాలనీల కోసం కొనుగోలు చేసిన భూములపై సీబీఐ విచారణ జరిపిస్తే ఈ ప్రభుత్వం బండారం బయటపడుతోందని ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కరోనా విలయతాండవం

అనంతపురం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కరోనా మహమ్మారి రాష్ట్రవ్యాప్తంగా విలయతాండవం చేసి వేలాది మంది ప్రాణాలు బలి కొందని టిడిపి రాష్ట్ర పొలిట్బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు విమర్శించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన సాధన దీక్షకు మద్దతుగా మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు దీక్ష చేపట్టారు. టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా టిడిపి పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరోనా మహమ్మారి ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటుంటే ప్రభుత్వం ఆదుకోవడం మరిచిపోయి చిన్న చూపు చూసి రాష్ట్ర బడుగు బలహీన వర్గాల జీవితాలను ప్రభుత్వం అతలాకుతలం చేసిందని మండిపడ్డారు. మొదటినుంచి కరోన పై ఏమాత్రం శ్రద్ధ చూపకుండా ప్రపంచమంతా విలవిలాడుతుంటే కూడ సింపుల్ పారాసిటమల్ నని సెలవిచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దక్కుతుందని ధ్వజ మెత్తారు.

# మావోయిస్టుల కుటుంబ సభ్యులకు పోలీసుల కౌన్సెలింగ్.....

## జన జీవన స్రవంతిలో కలవడానికి కుటుంబ సభ్యులు ఒత్తిడి తేవాలని పిలుపు

బెల్లంపల్లి అజ్ఞాతంలో ఉన్న కేంద్ర స్థాయి మావోయిస్టు నాయకులు ఇటీవల కరోనా బారిన పడి ప్రాణాలు వదులుతున్నారు. ఎన్నో ఏండ్లుగా అజ్ఞాతంలో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారని కానీ కరోనా విపత్కర పరిస్థితుల్లో సరైన వైద్యం అందక చనిపోవడం జరుగుతుందని ప్రభుత్వం వీరిపై ఉన్న కేసులను ఎత్తివేసి వైద్యాన్ని అందించడానికి ముందుకు వచ్చిందని మావోయిస్టు కుటుంబ సభ్యుల ద్వారా వారికి సమాచారం చేరే విధంగా పోలీసులు కొత్తగా కార్యక్రమాన్ని రూపొందించారు...మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం కన్నాల బస్తీకి చెందిన కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ 1978 ఎమర్జెన్సీ సమయంలో మావోయిస్టు కార్యకలాపాలు చురుకుగా సాగుతున్న సమయంలో ఆకర్షితుడై పార్టీలో చేరడం జరిగింది. అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్ర మావోయిస్టు కమిటీ సభ్యుడిగా ఉన్న సుదర్శన్ 70 సంవత్సరాల వయసున్న ఇప్పటికికూడా అజ్ఞాతంలోనే ఉన్నాడని అందుకే వనం వీడి జనంలోకి రావాలని పిలుపునిస్తూ సుదర్శన్ కుటుంబ సభ్యులనూ రామగుండం సీపీ సత్యనారాయణ కలవడం జరిగింది. వీరికి బియ్యం,దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వనం వీడి జనంలోకి రావాలని మీడియా ద్వారా కుటుంబ సభ్యులకు తెలపడం జరుగుతుందని కుటుంబసభ్యులు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని కోరడం జరిగిందని కరోనా విపత్కర పరిస్థితుల్లో అడవుల్లో సరైన వైద్యం అందక మావోయిస్టు అగ్ర నాయకులు చనిపోవడం జరుగుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని కుటుంబసభ్యుల ద్వారా లొంగిపోవాలని కోరడం జరిగిందని అన్నారు. అలాగే వీరి పైన ఉన్న 1కోటి 20 లక్షల రివార్డ్ వీరికే ఇవ్వడం జరుగుతుందని అలాగే ప్రభుత్వ పరంగా వీరికి అందే అన్ని సదుపాయాలు ఇప్పిస్తామని మీడియా ద్వారా నైనా రాజకీయ నాయకుల ద్వారా లొంగిపోవచ్చని అన్నారు. ఇది ఒక సదవకాశం అని ఒకవేళ లొంగిపోకపోతే చట్టం పని చట్టం చేసుకుపోతుందని అజ్ఞాతంలో ఉంది కన్నవారికి కుటుంబానికి దూరంగా ఉండడం వల్ల సాదించినదేమి లేదని పైగా కుటుంబంలో ముసలి వాళ్ళైన తల్లితండ్రులను కడసారి చుసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని కటకం సుదర్శన్ తండ్రి, భార్య చనిపోయిన చూసుకునే పరిస్థితి లేకుండాపోయిందని ఇప్పటికైనా శేష జీవితం తల్లి కుటుంబ సభ్యుల మధ్య గడపడానికి లొంగి పోవాలని కోరారు.

# అంబేద్కర్ యూనివర్సిటీ ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలి

## ప్రభుత్వానికి దళిత సేన నేత అరవ పూర్ణ ప్రకాష్ వినతి

నెల్లూరు అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలని దళిత సేన నేత పూర్ణ ప్రకాష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో గళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నామకార్థం తో పేద మధ్య తరగతి విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్లో 1982లో మొదటిసారిగా సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు అయింది అన్నారు. ప్రస్తుతం అంబేద్కర్ యూనివర్సిటీ ఉద్యోగులకు 16 నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం అమానుషం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 1991లో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గా పేరు మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, 2014 వరకు 13 జిల్లాలకు సంబంధించి 20 వేల మంది పైచిలుకు విద్యార్థులు డిగ్రీలో చేరుతూ వచ్చారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ కేవలం హైదరాబాదులో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అంబేద్కర్ యూనివర్సిటీ హైదరాబాదులో ఉన్నందున తెలంగాణ ఉద్యోగస్తులకు మాత్రమే జీతాలు చెల్లిస్తూ, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులకు జీతాలు పెండింగ్ లో పెట్టడం శోచనీయం అన్నారు. 2017 నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సి ఎఫ్ ఎం ఎస్ విధానం వలన పార్ట్ టైం ఉద్యోగుల జీతాలు నిలిచిపోవడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్లో 96 అధ్యయన కేంద్రాలు ఉండగా రాష్ట్ర విభజన అనంతరం ఆ సంఖ్య 76 కు పడిపోయిందన్నారు. అధ్యయన కేంద్రంగా పని చేస్తున్న సుమారు 350 మందికి గౌరవ వేతనాలు అద్భుత లేదని పేర్కొన్నారు. ఇటువంటి ఇబ్బందులు అంబేద్కర్ యూనివర్సిటీ లో తలెత్తకుండా ఉండాలంటే ఆంధ్రప్రదేశ్లో త్వరితగతిన అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి మీడియా ద్వారా విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సిబ్బంది ఎం రత్నయ్య, ఖాజావలి, హజరత్తయ్య, పద్మనాభం, నవీన్ కుమార్, రమేష్, శరత్, కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీకి కలిసి రాని కాలం

హైదరాబాద్, జూన్ 29, (న్యూస్ పల్స్)ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో అనూహ్యమైన.. ఇప్పటి వరకు ఎవరూ ఊహించని విషయంపై నేతలు గుసగుసలాడుతున్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి.. ఈ వారంలో ఒకరోజు.. పొద్దు పొద్దున్నే.. నిద్రలేవడంతోనే ఒక ఆసక్తికర పనిచేశారు. నిజానికి.. ఈ విషయం తెలిసిన వెంటనే టీడీపీ సీనియర్లు సైతం తెల్లబోయారు. అదేంటి.. కోడి కూడా కూయకముందే.. మా బాబు.. లేఖ రాశారు! అని నోరెళ్లబెట్టారు. నిజానికి ఇదో చిత్రమైన ఘటన. సాధారణంగా.. ఇటీవల కాలంలో జగన్ సర్కారుకు లేఖలు రాస్తున్నారు చంద్రబాబు. విషయం ఏదైనా.. ఆయన .. ముఖ్యమంత్రిని కోట్ చేస్తూ.. అనేక విషయాలను చర్చిస్తున్నారు. ఈ క్రమంలో అగ్రి గోల్డ్ బాధితులు, అమరావతి మహిళలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు.. తన పార్టీ నేతలపై కేసులు.. ఇలా అనేక అంశాలను ప్రస్తావిస్తూ.. చంద్రబాబు.. జగన్కు లేఖలు సంధిస్తున్న విషయం తెలిసిందే. అయితే.. ఎప్పుడు లేఖరాసినా.. అది మధ్యాహ్నం 1-4 గంటల మధ్య ఉంటుంది. ఇక, మీడియాలోనే అప్పుడే బ్రేకింగ్గా వస్తుంది. కానీ, చంద్రబాబు.. ఇటీవల పొద్దు పొద్దున్నే అంటే.. ఉదయం 6 గంటలకే లేఖ సంధించారు. ఖచ్చితంగా ఉదయం 6 గంటలకే రాసిన చంద్రబాబు లేఖను ఆయన అనుకూల వర్గం మీడియాలో బ్రేకింగ్ ఐటెంగా కూడా ప్రచారం కల్పించారు. దీంతో టీడీపీలో ఈ ఘటన ఆసక్తిగా మారింది. ఇంత పొద్దున్నే చంద్రబాబు లేఖ రాయడం ఏంటని చర్చించుకున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే.. రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల సొమ్ములను ప్రభుత్వం ఇవ్వడం లేదని.. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని.. ప్రభుత్వమే ధాన్యం కొనాలని.. కోరడమే ఇతమిత్థంగా చంద్రబాబు లేఖ సారాంశం. అయితే.. ఇంత హడావుడిగా ఎందుకు రాయాల్సి వచ్చింది ? అనేది కీలక ప్రశ్న. దీనికి ప్రధాన కారణం.. ఆయనను ఒక కీలక అధికారి తప్పుదోవ పట్టించడమేనని తెలిసింది. ఈ రోజు మధ్యాహ్నమే? ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లిస్తోందని.. సదరు చంద్రబాబు ఉప్పు తిన్న అధికారి ఒకరు సమాచారం చేరవేశారట. దీంతో బాబు రాత్రికి రాత్రి పెన్ను పట్టుకుని లేఖ సంధించారు. దీంతో తెల్లారేసరికి అది వైరల్ అయింది. రైతులకు అన్యాయం చేస్తున్నారని కూడా ఈ లేఖలో విమర్శించారు. కట్ చేస్తే.. అదే రోజు కనుక రైతులకు నిధులు ఇచ్చినట్టయితే.. ఈ ఎఫెక్ట్.. అంతా కూడా తన లేఖ వల్లే సాకారం అయిందని.. జగన్ మెడలు వంచి.. రైతులకు డబ్బులు ఇప్పించానని చెప్పుకొనేందుకు.. చంద్రబాబుకు అవకాశం ఉండేది. కానీ, ప్రభుత్వం మాత్రం ఈ విషయాన్ని వాయిదా వేసింది. దీనికితోడు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.. చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. దీంతో మొత్తంగా అనుకున్నది ఒక్కటి .. అయింది ఒకటి అన్నట్టుగా బాబుకు అనుభవం అయిందని అంటున్నారు పరిశీలకులు.

# పెద్దాపురంలో మట్టిపై వైసీపీ కీలక నేత కన్ను...



తూ.గో.జిల్లా: పెద్దాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అక్రమ సంపాదన కోసం ఓ వైసీపీ నాయకుడు చెలరేగిపోతున్నాడు. 823 ఎకరాల రామేశ్వరం మెట్టలో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. పచ్చటి పంట పొలాల స్వరూపాన్ని మార్చేస్తున్నాడు. అడ్డుకోవాల్సిన ఘనుల శాఖ అధికారులు చోద్యం చూడ్డంతో ఫ్యాన్ పార్టీ నాయకుడు అక్రమార్జనకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. సర్వే నెంబర్ ఒకటి నుంచి 90 వరకు 823 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించి ఉన్నాయి. కాకినాడకు సమీపంలో ఉన్న ఈ కొండలు, గుట్టల్లో నిక్షిప్తమై ఉన్న కోట్ల క్యూబిక్ మీటర్ల గ్రావెల్పై వైసీపీ కీలక నేత కన్ను పడింది. కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, కోనసీమ, యానం తదితర ప్రాంతాల్లో వెంచర్ల రహదారి నిర్మాణాల అవసరాలకు మట్టికి ఎనలేని డిమాండ్ ఉంది. దీంతో సదరు కీలక నేత ఇక్కడున్న గ్రావెల్ను తరలించి కోట్ల రూపాయలు దండుకోవాలని స్కెచ్ వేశాడు. ఈయనకు ప్రభుత్వంలో ముఖ్యనేతకు ఉన్న సాన్నిహిత్యంతో మరింత రెచ్చిపోయాడు. అనుకున్నదే తడవుగా ఈ కొండలపై వాలిపోయాడు.

## గ్రామాభివృద్దే ఎమ్మెల్యే ధ్యేయం !

కోసిగి మేజర్ పంచాయతీ అయిన కోసిగి గ్రామాన్ని, అన్ని విధాల అభివృద్ధి చేయడానికి మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి సహకారంతో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని మండల వైయస్ఆర్సిపి ఇన్చార్జ్ మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగి లోని భూ గేనీ చెరువు సమీపంలో తాగునీటి సంపు కోసం మేజర్ పంచాయతీ సర్పంచ్ సంజిపోగు అయ్యమ్మ ఆధ్వర్యంలో భూమి పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ మండల ఇన్చార్జి మురళి మోహన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే బాల రెడ్డి సహకారంతో కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.. అలాగే కోసిగి లో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఏడు లక్షల రూపాయలతో సంపు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. సంపులో లక్ష 50 వేల లీటర్లు నీటి ని నిల్వ చేసే సౌకర్యం ఉంటుందన్నారు .దీంతో మేజర్ పంచాయతీ లో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు తోడ్పడుతుందని వారు తెలియజేశారు. ఇందులో వైసీపీ నాయకులు లవకుశ ఈరన్న,మాణిక్య రాజు , నాడిగేని నాగరాజు,,పంచాయితీ కార్యదర్శి సత్యాన్నకాంట్రాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థి సంఘం నాయకులను వెంటనే విడుదల చేయాలి

నందికొట్కూరు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కర్నూలు జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన వారిని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని వెంటనే వారి పై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు మజీద్ మియా ఖండించారు. మంగళవారం నాడు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల మానిఫెస్టోలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీని మరిచిపోయారని అన్నారు .కల్లబొల్లి మాటలు చెప్పి నిరుద్యోగ స్తులను మోసం చేయడం జగన్ మోహన్ రెడ్డి కి తగున ఆన్నారు .జాబ్ క్యాలెండర్ పేరుతో ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానని ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తయిన ఎక్కడ ఖాళీ పోస్టులు పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తా మనీ ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఇంతవరకు నెరవేర్చలేదని అందువల్ల తక్షణమే నిరుద్యోగ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సి పి ఐ ఎం ఎల్ లిబరేషన్ డివిజన్ కార్యదర్శి గోపాలకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు సురేష్, ఐ ఎఫ్ టీ యు నాయకులు మౌలాలి ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జులై 3,4 తేదీల్లో హౌసింగ్ గ్రౌండ్ మేళా

## గూడూరులో 3870 మంది వరకు లబ్ధిదారులు

## ప్రతి 50 ఇళ్ళ కు ఒక సెక్రటరీ నియామకం

## సబ్ కలెక్టర్ బాపిరెడ్డి వెల్లడి

గూడూరు జులై నెల 3,4 తేదీల్లో జరిగే హౌసింగ్ గ్రౌండ్ మేళాని గూడూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని గూడూరు సబ్ కలెక్టర్ బాపిరెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలో మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న గూడూరు వెలుగు కార్యాలయంలో గూడూరు తహశీల్దార్,ఎంపీడీవో,గృహ నిర్మాణ శాఖ అధికారులు,గ్రామ రెవెన్యూ అధికారులు తో సమీక్ష సమావేశం గూడూరు సబ్ కలెక్టర్ బాపిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గూడూరులో సుమారు 3870 మంది లబ్ధిదారులు వున్నారు అని, లబ్ధిదారుల అందరూ హౌసింగ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జులై 3,4 తేదీల్లో ఇళ్ళు నిర్మాణం మొదలు పెట్టాలి అని,ప్రతి 50 ఇళ్ళ కు ఒక సెక్రటరీ ని నియమించి, ఇంటి నిర్మాణంకు అవసరమైన ఇసుక,స్టీల్,సిమెంట్ తదితర మెటీరియల్ సరఫరా ప్రక్రియ వారు పర్యవేక్షిస్తారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నుండి వచ్చే సౌకర్యాలను లబ్ధిదారులు అందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు కమిషనర్ రఘుకుమార్,గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి, ఎంపీడీవో నాగమణి,గృహ నిర్మాణ శాఖ అధికారులు, వి ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి తెల్లరేషన్ కార్డు దారునికి రూ.10వేలు ఇవ్వాలి: గద్దె రామమోహన్



అమరావతి: కరోనా కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్గ్రేషియా, ఆక్సిజన్ అందక మరణించిన కుటుంబాలకు రూ. 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలంటూ తెలుగుదేశం పార్టీ ఆందోళన చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ సాధన దీక్ష జరుగుతోంది. అందులో భాగంగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ రావు టీడీపీ కార్యాలయంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మొదటి వేవ్ కరోనా వచ్చినప్పుడు కరోనాతో చికిత్స పొందిన వారికి రూ. 2వేలు ఇస్తానని సీఎం జగన్ ప్రకటించారని, ఏ ఒక్కరికైనా 2వేలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఏడాదిన్నరగా ఉపాధి లేక, ఉద్యోగాలు లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని.. ఆయా కుటుంబాలకు ముఖ్యమంత్రి ఏం సహాయం చేశారని ఆయన నిలదీశారు. ఇప్పటికైనా ప్రతి తెల్లరేషన్ కార్డు దారునికి రూ. 10వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్నా క్యాంటిన్లు మూసివేయడం వల్ల పేదలకు భోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను కూడా ఫ్రంట్ లైన్ వారియర్స్గా పరిగణించి..వారికి రూ. 50లక్షలుఇవ్వాలన్నారు. ఇప్పటికె ైనా ప్రభుత్వం స్పందించకపోతే దీన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకు వెళ్లడానికి కార్యాచరణ రూపొందిస్తామని గద్దె రామమోహన్ స్పష్టం చేశారు.

## దర్శి లో సాధన దీక్ష లో పాల్గొన్న పమిడి రమేష్

దర్శి ప్రకాశం జిల్లా దర్శి లో మంగళవారం కోవిడ్ బాధితులకు అండగా తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కు మద్దతుగా దర్శి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పమిడి రమేష్ మరియు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు సాధన దీక్ష లో పాల్గొన్నారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 10 వేల రూపాయలు, కోవిడ్ వల్ల మృతి చెందిన కుటుంబానికి 10 వేలు,జీవనోపాధి కోల్పోయిన ప్రైవేట్ టీచర్లకు, భవన నిర్మాణం కార్మికులు కు,చిరు వ్యాపారులు కు 10 వేలు రూపాయలు చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం కు విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా ఆక్సిజన్ కొరతతో మరణించిన వారి కుటుంబాలకు 25లక్షలు రూపాయలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో దర్శి నియోజకవర్గం టీడీపీ నాయకులు ఐదు మండలాలు టీడీపీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం ఇస్తారా లేక జైల్లో పెడతారా

## ఏఐఎస్ఎఫ్

ఎమ్మిగనూరు జూన్ 29, (న్యూస్ పల్స్) రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వ తేదీన విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ లో కేవలం 10143 మాత్రమే ఉద్యోగాల భర్తీకి సంబంధించి క్యాలెండర్ ను విడుదల చేయడం పట్ల నిరుద్యోగులు పెద్దఎత్తున రోడ్ ఎక్కడం జరిగిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తాలూకా అధ్యక్షులు సామీ ఉల్లా మాట్లాడుతూ తెలిపారు. అనంతరం స్థానిక సిపిఐ కార్యాలయంలో ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో సామీఉల్లా మాట్లాడుతూ ఎన్నికల ముందు జాబు కావాలంటే బాబు పోవాలి అని నినాదం తో పాదయాత్ర చేసిన సందర్భంలో జగన్మోహన్ రెడ్డి చెప్పడం జరిగింది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు జాబ్ లు రాలేనందు వలన, బాబుకు గద్దె దింపాలని ఆకాంక్షతో నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు,యువజన సంఘాలు పెద్ద ఎత్తున ఓట్లు వేసి జగన్ మోహన్ రెడ్డి ని అధికారం లోకి తీసుకో రవాడం జరిగింది. అధికారంలో వచ్చిన జగన్మోహన్ రెడ్డి రెండు సంవత్సరాల కాలంలో ఏ మాత్రం జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయకుండా నిరుద్యోగులకు మభ్య పెట్టడం జరిగిందని ఎట్టకేలకు జాబ్ క్యాలెండర్ను విడుదల చేసి అందులో కేవలం 10,143 మాత్రమే ఉద్యోగాలు పొందుపరచడం జరిగింది. మిగితా దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 2,35,794 ఖాళీగా ఉంటే దానిని భర్తీ చేయడంలో పూర్తిగా విఫలం కావడం జరిగింది ఇప్పటికే గ్రూపు వన్ గ్రూపు టూ కి సంబంధించిన పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా 60000 పోస్టులుంటే కేవలం 34 పోస్టులు భర్తీ చేయడం జరిగింది అదేవిధంగా పోలీసుల ఉద్యోగుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల పోస్ట్ లు ఉంటే కేవలం 450 పోస్టులు మాత్రమే పొందుపరిచారు అదేవిధంగా 26 వేల టీచర్ పోస్టులు ఉంటే ఒక్క పోస్టుల భర్తీకి సంబంధించి పొందుపరచలేదు. సమస్యల పై నెల 28వ తేదీ శాంతియుతంగా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తే రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగుల పై కక్ష సాధింపు ధోని తో అక్రమ కేసులు బనాయించి జైలు జైలుకి పంపించడం జరిగింది. రేపటి రోజున నిరసన కార్యక్రమానికి 30వ తేదీన పిలుపు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు షఫీ,రామంజి, ఖాదర్,నూర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

# మీ రక్తపోటును తగ్గించడానికి మరియు మీ హృదయాన్ని రక్షించడానికి 'ఇలా' చేస్తే సరిపోతుంది ...!



పురుగుమందులు మరియు సింథటిక్ ఎరువులు వంటి రసాయనాలను ఉపయోగించకుండా తయారుచేసిన సేంద్రీయ ఆహారం ప్రజలపై సానుకూల ప్రభావాన్ని చూపింది. ఈ కారణంగా, సేంద్రీయ ఆహారాలలో అన్ని రకాల రసాయనాల సహాయంతో పెరిగిన సాధారణ ఆహారాలతో పోలిస్తే ఎక్కువ ఫైబర్ మరియు పోషకాలు ఉంటాయి. ఈ ఆహార పదార్థాల సేంద్రీయ పెరుగుదల కారణంగా, వాటి డిమాండ్ పెరుగుతోంది. సేంద్రీయంగా పెరిగిన ఆహారాలలో విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం మరియు భాస్వరం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయని ఆధారాలు పెరుగుతున్నాయి. ఈ వ్యాసంలో, సేంద్రీయ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా నయం చేయగల కొన్ని లోపాలను పరిశీలిస్తాము. గుండె జబ్బులు గుండె జబ్బులు మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి మీరు అనేక జాగ్రత్తలు తీసుకోవచ్చు. అంటే ఆరోగ్యకరమైన జీవన ప్రణాళిక, ధూమపానం మానేయండి. అలాగే, మీ జీవితంలో ఒత్తిడిని తగ్గించడానికి రోజూ వ్యాయామం చేయండి లేదా యోగా సాధన చేయండి. వీటన్నిటికీ కీలకం మీరు తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇంటి నుండి ఆఫీసు పని చేయడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు! ఈతీనీఎ ఊనీఎవ: ఇంటి నుండి ఆఫీసు పని చేయడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు! పోషకాలు అధికంగా ఉండే ఆహారం పోషకాలు అధికంగా ఉండే ఆహారం సేంద్రీయ ఆహారానికి మారడం మీ గుండె పరిస్థితిని మెరుగుపరచడంలో సహాయపడే సులభమైన మార్గాలలో ఒకటి. సేంద్రీయ ఆహారాలు బీన్స్, బఠానీలు, కాయధాన్యాలు మరియు చిక్కుళ్ళు తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్ (ఎల్‌డిఎల్) లేదా "చెడు కొవ్వు" ను గణనీయంగా తగ్గిస్తాయి. అవి ఫైబర్, ప్రోటీన్ మరియు యాంటీఆక్సిడెంట్ పాలిఫెనాల్స్‌తో నిండి ఉంటాయి. ఇవన్నీ గుండెకు, సాధారణ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బెర్రీలు మరియు బ్రోకలీ మంచి యాంటీఆక్సిడెంట్లు, ఇవి ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తాయి మరియు గుండె జబ్బులను నివారిస్తాయి. మీరు ఆకలితో ఉన్నప్పుడు మీకు తెలియకపోయినా, ఎట్టి పరిస్థితిలో ఈ పనులు చేయకండి!మీరు ఆకలితో ఉన్నప్పుడు మీకు తెలియకపోయినా, ఎట్టి పరిస్థితిలో ఈ పనులు చేయకండి! దృష్టి లోపం దృష్టి లోపం జింక్, రాగి, విటమిన్ సి, విటమిన్ ఇ మరియు బీటా కెరోటిన్ వంటి కొన్ని పోషకాలు కంటి ఆరోగ్యంలో వయస్సు సంబంధిత క్షీణత ప్రమాదాన్ని 25 శాతం తగ్గించగలవని 2001 లో ప్రచురించబడిన ఏజ్-రిలేటెడ్ ఆప్తాల్మాలజీ సర్వే (ఒఖీఇఆూ) కనుగొంది. చియా విత్తనాలు మరియు అవిసె గింజల్లో ఒమేగా -3 లు అధికంగా ఉంటాయి మరియు విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. కాలే మరియు కాలర్డ్స్ వంటి ఆకుకూరలు లూటిన్ మరియు జియాక్సంతిన్ రెండింటిలోనూ పుష్కలంగా ఉంటాయి మరియు కళ్ళకు విటమిన్ సి మంచి మూలం. మీ కంటి చూపును ఆరోగ్యకరమైన రీతిలో మెరుగుపరచడానికి సహాయపడే ఆహారాలు ఇవి. మీ బిడ్డను కరోనా నుండి రక్షించడానికి వారి రోగనిరోధక శక్తిని ఎలా పెంచుకోవాలి?మీ బిడ్డను కరోనా నుండి రక్షించడానికి వారి రోగనిరోధక శక్తిని ఎలా పెంచుకోవాలి? నిరాశ మరియు ఆందోళన నిరాశ మరియు ఆందోళన బైపోలార్ డిజార్డర్, డిప్రెషన్ అని కూడా పిలుస్తారు, ఇది చాలా సాధారణ మానసిక ఆరోగ్య పరిస్థితులలో ఒకటి. మందులు మీ మానసిక స్థితిని నియంత్రించగలవు. మీ డైట్‌లో కొన్ని మార్పులు చేయడం ఇలాంటి ఎపిసోడ్‌లను నిర్వహించడానికి సహాయపడే మరో మార్గం. తృణధాన్యాలు మీ మనస్సుపై శాంతపరిచే ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది కార్బోహైడ్రేట్లు మీ మెదడులో సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచుతాయి, ఇది మీ మానసిక స్థితిని తగ్గించడానికి మరియు మిమ్మల్ని మరింత నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది. చమోమిలే ఒక మూలిక, ఇది ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. చమోమిలే దాని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ ఎఫెక్ట్స్ కారణంగా ఒత్తిడిని తగ్గించటానికి సహాయపడుతుంది.మెదడు మరియు నరాల అభివృద్ధికి జింక్ అవసరం మరియు దాని లోపం మానసిక స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. శరీరంలో జింక్ కోసం అతిపెద్ద నిల్వ స్థలాలు ఇంద్రియాలతో సంబంధం ఉన్న మెదడు ప్రాంతాలలో ఉన్నాయి. పెరుగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా, లాక్టోబాసిల్లస్ మరియు ఫైటోబాక్టీరియా ఉన్నాయి. ఈ బ్యాక్టీరియా మరియు ఈస్ట్ ఉత్పత్తులు మెదడు ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. అధిక రక్త పోటు అధిక రక్త పోటు కొన్ని ద్రాక్షలో 1 గ్రాము ఫైబర్, 212 మి.గ్రా పొటాషియం ఉంటాయి. అధిక రక్తపోటు (ఆయాఊ) ఆహారాన్ని ఆపడానికి ఈ రెండింటినీ ఆహార విధానాలలో సిఫార్సు చేస్తారు. ద్రాక్ష, వైన్ మరియు రసం వంటి ఆహారాలలోని పాలీఫెనాల్స్ రక్తపోటును తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రభావవంతంగా ఉంటుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

# కరోనా బాధితులను అదుకోవాలి

## మంత్రాలయం నియోజకవర్గం టిడిపి ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి

కౌతాళం జూన్ 29, (న్యూస్ పల్స్) రాష్ట్రంలో కరోనా బాధితులను అదుకోవడంలో వైయస్సార్ ప్రభుత్వం పూర్తిగా విపలం అయిందని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి మండిపడ్డారు. కరోనా బాధితుల కోసం తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేస్తూన్న సాదన దీక్షకు మద్దతు గా మంత్రాలయం లో తెలుగు దేశం పార్టీ ఆఫీస్ లో మంత్రాలయం మండల టిడిపి పార్టీ కన్వీనర్ పన్నాగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన సాదన దీక్ష కూర్చోవడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి తిక్కరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలు ఆరోగ్యని గాలికి వదిలేసింది అని కరోనా వైరస్ నివారణ లో పూర్తి గా నిర్లక్ష్యము చేసి అనేక మంది ప్రాణలు పోవడానికి కారణం వైయస్సార్ ప్రభుత్వం అని వారు వాపోయారు అందుకు కరోనా తో మృతి చెందిన వారి కుటుంబలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ దీక్ష కూర్చోవడం జరిగిందిప్రదాన మైన డిమాండ్స్ 1. ప్రతి కోవిడ్ మృతుల కుటుంబానికి పది లక్షలు రూపాయలు పరిహా?రం ఇవ్వాలి 2. ఆక్సిజన్ కొరత తో మరణించిన మృతుల కుటుంబానికి 25లక్షలు ఇవ్వాలి 3.ప్రతి తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి పది వేలు ఆర్థిక సహాయం చేయాలి 4. జీవనోపాధి కోల్పోయిన ప్రైవేటు టీచర్స్ కు నిర్మాణ కార్మికులకు చిరు వ్యాపారస్తులకు 10వేలు సాయం చేయాలని డిమాండ్ చేశారు . ఈ దీక్ష లో పాలకుర్తి తిక్కరెడ్డి గారు తో పాటు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు నరవ రమాకాంత్ రెడ్డి యువత జిల్లా ప్రదాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి రాష్ట్ర తెలుగు యువత నాయకులు సురేష్ నాయుడు సీనియర్ నాయకులు బూదురు మల్లికార్జున రెడ్డి లీగల్ సెల్ అధ్యక్షుడు బాబురావు ముత్తురెడ్డి జిల్లా రైతు సంఘం కార్యదర్శి నాడిగేని అయ్యన్న పల్లెపాడు రామిరెడ్డి పెద్ద కడబూరు మండలం కన్వీనర్ బసలదోడ్డి ఈరన్న జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి పార్లమెంటు కార్యదర్శి కోట్రేష్ గౌడ్ మాలపల్లి చావిడి వెంకటేష్ తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి జ్ఞానేష్ మైనారిటీ అధ్యక్షుడు టిపుసుల్తాన్ ఎరిగేరి రామలింగ బోంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు చిలుక తాయన్న బుజ్జి స్వామి అర్లబండ రామంజీ వగరూరు రామిరెడ్డి అబ్దుల్ చిలకలడోణ హనుమంతు సుకేశ్వరి రోగప్ప లక్ష్మారి రామయ్య చెట్నపల్లి తిక్కస్వామి యస్ సెల్ జిల్లా కార్యదర్శి సల్మాన్ రాజు యోబు నియోజకవర్గం యస్ సి సెల్ అధ్యక్షుడు బోగ్గల నరసన్న రణ తిక్కన్న ప్రభాకర్ రెడ్డి బెళగల్ సర్పంచ్ రామయ్య తెలుగు యువత నాగరాజు మౌనేష్ నిలకఠ గుండేష్ లతిఫ్ ఉసేని రాజశేఖరరెడ్డి చిదానంద హనుమన్న కృష్ణా శేఖర్ నారాయణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# భర్త హత్యకేసులో భార్య ఆరెస్టు

నెల్లూరు నిత్యంమద్యంమత్తులో వేధించే భర్త ఆగడాల నుంచి బయటపడడం..పరాయిపురుషుడు సాంగత్యం, కోసం కట్టుకున్న భర్తనే అత్యంతదారుణంగా కడతేర్చిన ఓ మహిళ కథ ఇది.... అడ్డుగాఉన్నభర్త ను వదిలించుకునేందుకు కొందరిసహకారంతో హత్య చేయించింది. ఆనేపం తనపైకి రాకుండా ఉండేందుకు అత్యంత ప్రణాళిక రచించింది... ఏమీ ఎరగనట్టు నాటకం ఆడింది.. తమదైన రీతిలో విచారించిన పోలీసులకు అసలు విషయం చెప్పింది... నెల్లూరు నగరంలో సంచలనం కలిగించిన హత్య కేసు వివరాలను పోలీసులు వెల్లడించారు.నగరంలోని జాకీర్ హుస్సేన్ నగర్ లో వారం క్రితం జరిగిన ఫయాజ్ హత్య కేసును నవాబ్ పేట పోలీసులు ఛేదించారు.

# ఫైనల్ మ్యాచ్ చూడలేక బాత్‌రూమ్‌లో దాక్కున్నా!

వెల్లింగ్టన్: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో న్యూజిలాండ్ గెలిచింది. ఆ టీమ్ పేస్ బౌలర్ కైల్ జేమీసన్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. కానీ చివరి రోజు తన టీమ్ చేజింగ్ చేస్తున్నప్పుడు ఆ టెన్షన్ తట్టుకోలేక తాను బాత్‌రూమ్‌లో దాక్కున్నట్లు అదే బౌలర్ చెప్పడం విశేషం. ప్రస్తుతం ఇంగ్లండ్ కౌంటీ టీమ్ సర్రేకు ఆడుతున్న అతడు.. ఓ టీవీ ఇంటర్వ్యూలో ఫైనల్ మ్యాచ్ చివరి రోజు డ్రెస్సింగ్ రూమ్‌లో తాను పడ్డ టెన్షన్ గురించి చెప్పాడు. ఓ మ్యాచ్ చూడటానికి తాను ఇంత ఇబ్బంది పడిన సందర్భంగా బహుశా గతంలో ఎప్పుడూ లేదు. మేము డ్రెస్సింగ్ రూమ్ లోపల కూర్చొని టీవీలో మ్యాచ్ చూస్తున్నాం. ప్రతి బాల్‌కు ఇండియన్ ఫ్యాన్స్ అరుస్తున్నప్పుడల్లా వికెట్ పడిందా అన్న ఆందోళన నాలో కలిగింది.


# పుష్ప సందడి అంతా ఇక్కడి వరకేనా?




అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పుష్ప సినిమా రెండు పార్ట్ లుగా విడుదల కాబోతున్న విషయం తెల్సిందే. రికార్డు స్థాయి బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమా ను పాన్ ఇండియా రేంజ్ లో విడుదల చేయాలని నిర్ణయించారు. సినిమా ఇతర భాషల మార్కెట్ కోసం పలువురు పక్క భాషల స్టార్స్ ను తీసుకు వచ్చారు. పుష్ప సినిమా లోని యాక్షన్ సన్నివేశాలు మరియు ఇతర మాస్ సన్నివేశాలు మామూలుగా ఉండవు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు ముఖ్యంగా చిత్ర యూనిట్ సభ్యులు అంచనాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. దాంతో తెలుగు ప్రేక్షకులు పుష్ప సినిమా పై ఆకాశమే హద్దు అన్నట్లుగా అంచనాలు పెంచుకుని వెయిట్ చేస్తున్నారు.పుష్ప సినిమా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ బిజినెస్.. ఓటీటీ రైట్స్ ఇంకా శాటిలైట్ రైట్స్ ధర లు అన్ని కూడా మారు మ్రోగి పోయే అవకాశం ఉంది. కాని ఇతర భాషల్లో మాత్రం ఈ సినిమా అంతగా బిజినెస్ చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బన్నీకి మలయాళంలో మంచి మార్కెట్ ఉంది. పైగా మలయాళం స్టార్ ఫాహద్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. కనుక అక్కడ పుష్ప కు మంచి రేటు దక్కవచ్చు. కాని ఇతర భాషలు అయిన కన్నడం.. హిందీ మరియు తమిళ భాషల్లో మాత్రం పుష్ప పరిస్థితి ఏంటీ అంటే ఇప్పుడే చెప్పలేమనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.పుష్ప హిందీ రైట్స్ ను గతంలోనే 17.5 కోట్లకు అమ్మినట్లుగా వార్తలు వచ్చాయి. అది ఎంత వరకు నిజం అనేది క్లారిటీ లేదు. కాని పుష్ప రేంజ్ కు ఆ మొత్తం చాలా తక్కువ అంటున్నారు. కనీసం పాతిక కోట్లు అయినా హిందీ రైట్స్ కు పుష్ప రాబట్టాల్సి ఉందంటున్నారు. ఇక తమిళ రైట్స్ విషయంలో కూడా బేరాలు సాగుతున్నాయి. అక్కడ అయిదు కోట్లకు మించి రావేమో అని కొందరు అంటున్నారు. కాని పుష్ప కు అక్కడ 10 నుండి 15 కోట్ల రాబట్టగల సత్తా ఉంది. ప్రస్తుతానికి పుష్ప గురించి తెలుగులో విపరీతమైన బజ్ ఉంది కాని ఇతర భాషల్లో లేదు. అందుకే పుష్ప సినిమా ను అక్కడి వారు భారీ మొత్తంతో కొనుగోలు చేయాలంటే విడుదల సమయంకు భారీగా ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# 'ఆదిపురుష్' టీమ్ లో మార్పులు..?

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కిట్ లో మొత్తం నాలుగు చిత్రాలు ఉన్నాయి. ఇందులో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న చిత్రం 'ఆదిపురుష్'. ఈ చిత్రం రామాయణం బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతుండడం.. ఇందులో ప్రభాస్ రాముడిగా కనిపించనుండడంతో అందరిలోనూ అటెన్షన్ క్రియేట్ అయ్యింది. నిజానికి తెలుగులో.. ఎన్టీఆర్ శోభన్ బాబు తర్వాత ప్రముఖంగా ఎవరూ రాముడి పాత్ర వేయలేదు.ప్రభాస్ పాన్ ఇండియా స్టార్ గా వెలుగుతున్న ఈ సమయంలో రాముడి క్యారెక్టర్ పోషిస్తుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 'ఆదిపురుష్'లో ప్రభాస్ ఎలా కనిపించబోతున్నాడు? అన్నదే అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్న అంశం. ఇదిలాఉంటే.. ఈ సినిమా టీమ్ లో మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయనే ప్రచారం సాగుతోంది.'ఆదిపురుష్'లో ప్రభాస్ రాముడిగా నటిస్తుండగా.. లంకేశ్వరుడిగా బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కనిపించబోతున్నారు. సీత పాత్రలో కృతి సనన్ నటిస్తున్నారు. వీరితోపాటు పలువురు కీలక పాత్రల కోసం ఫైనల్ అయ్యారు. అయితే.. హిందీ 'బిగ్ బాస్' ఫేం సిద్ధార్థ్ శుక్లాను కూడా ఈ చిత్రంలోకి తీసుకున్నారనే ప్రచారం సాగింది. మంచి టాలెంటెడ్ యాక్టర్ గా పేరు తెచ్చుకున్న ఇతన్ని ఫైనల్ చేశారనే టాక్ వచ్చింది. కానీ.. తనకు ఎలాంటి సమాచారం లేదని ఆ మధ్య క్లారిటీ ఇచ్చాడు సిద్ధార్థ్.లేటెస్ట్ అప్డేట్ ప్రకారం.. సిద్ధార్థ్ ఉన్నాడనే అంటున్నారు. ఓ కీలకమైన పాత్ర కోసం అతన్ని తీసుకున్నారని బాలీవుడ్ సర్కిల్స్ లో చర్చ సాగుతోంది. మరి ఈ నటుడిని తీసుకున్నారా? లేదా? అనేది యూనిట్ కన్ఫామ్ చేయాల్సి ఉంది.ఇదిలాఉంటే.. ఈ మధ్యనే మహారాష్ట్ర ప్రభుత్వం షూటింగులకు అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త షెడ్యూల్ ప్లాన్ చేస్తోంది యూనిట్. ఔట్ డోర్ షూటింగ్ ఇంకా 90 రోజులు బ్యాలెన్స్ ఉందని తెలుస్తోంది. ఈ సినిమా ఎక్కువ భాగం సీజీ వర్క్ మీదనే నడిపించాల్సి ఉన్నందువల్ల.. త్వరగా ఫినిష్ చేసి ఇండోర్ లో గ్రాఫిక్స్ వర్క్ పై దృష్టి పెట్టాలని చూస్తున్నాడు దర్శకుడు ఓం రౌత్.





# ఈష రెబ్బా రెబల్ కా బాప్ లా ..!



తెలుగమ్మాయిలు మడిగట్టుకుని కూచునే రోజులు పోయాయ్. సోషల్ మీడియాల వెల్లువలో హద్దులు చెరిపేసి మన భామలు కూడా స్టార్లు అవుతున్నారు. సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ ఈజీగా సినీవరల్డ్ కి కనెక్టవుతున్నారు. ఇరుగు పొరుగు భాషల్లోనూ పాపులరవుతున్నారు.వరంగల్ బ్యూటీ ఈషా రెబ్బా ఇతర భామలకు ధీటుగా వరుస ఫోటోషూట్లతో అంతర్జాలంలో సంచలనంగా మారుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈషా కి ఇన్ స్టాలో భారీ ఫాలోవర్స్ ఉన్నారు. వారి కోసం అవసరమైన ట్రీట్ ని ఈ తెలుగమ్మాయ్ ఎప్పటికప్పుడు ప్లాన్ చేస్తూనే ఉంది. తాజాగా ఈషా రెబలియన్ యాటిట్యూడ్ ప్రముఖంగా యువతరాన్ని ఆకర్షించింది.చిరుతపులిని తలపించే డిజైనర్ డ్రెస్ లో ఈషా ఎంతో స్పెషల్ గా కనిపిస్తోంది. ఆ కళ్లకు రేబాన్ ధరించి ఫ్రీస్టయిల్లో డఫెల్ బ్యాగీ ఫ్యాంట్ లో సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. ముఖ్యంగా ఈషాలోని రెబలిజం బయటపడింది. ప్రస్తుతం ఈ బ్యూటీ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అనే చిత్రంలో నటించింది. అలాగే మరిన్ని సినిమాలకు కమిటైనా లాక్ డౌన్ వల్ల వెయిటింగ్ . వీటిలో చాలా ప్రకటించాల్సి ఉంది. ఈషా ప్రస్తుతం ఇరుగు పొరుగు భాషల్లోనూ అవకాశాల కోసం ప్రయత్నిస్తోందని సమాచారం.

# 'జాంబీరెడ్డి' కాంబోలో సూపర్ హీరో "హను-మాన్" సినిమా ప్రారంభం..!




క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కెరీర్ ప్రారంభం నుంచీ కొత్త తరహా కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు రూపొందిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు. 'అ!' సినిమాతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ప్రశాంత్.. ఇటీవల తేజ సజ్జా ను హీరోగా పరిచయం చేస్తూ 'జాంబీరెడ్డి' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఈ క్రమంలో మరో కొత్త జోనర్ ను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయడానికి రెడీ అయ్యారు ప్రశాంత్ వర్మ. "హను-మాన్" అనే పేరుతో ఫస్ట్ ఒరిజినల్ ఇండియన్ సూపర్ హీరో మూవీని తెరకెక్కిస్తున్నాడు.'జాంబీరెడ్డి' సినిమాతో సక్సెస్ ఫుల్ గా లాంచ్ చేసిన తేజ సజ్జా ను "హను-మాన్" చిత్రం కోసం హీరోగా ఎంపిక చేసుకున్నాడు. ఇటీవల ప్రశాంత్ వర్మ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ మరియు టైటిల్ టీజర్ కు విశేష స్పందన లభించింది. టాలెంటెడ్ డైరెక్టర్ మరో సరికొత్త కాన్సెప్ట్ తో రాబోతున్నట్లు హింట్ ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ఈ రోజు శుక్రవారం హైదరాబాద్ లో 'హను-మ్యాన్' చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. నిర్మాత జెమిని కిరణ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. మరో ప్రొడ్యూసర్ సి.కళ్యాణ్ క్లాప్ ఇచ్చారు. శివశక్తి దత్త మొదటి షాట్ కు గౌరవ దర్శకత్వం వహించారు."హను-మాన్" చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. అస్రిన్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా.. వెంకట్ కుమార్ జెట్టీ లైన్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. స్క్రిప్ట్ విల్లే స్క్రీన్ ప్లే అందిస్తున్న ఈ చిత్రానికి దాశరధి శివేంద్ర సినిమాటోగ్రఫీ అందించనున్నారు. ఈ చిత్రాన్ని గ్రాండ్ స్కేల్ లో హై టెక్నికల్ వాల్యూస్ విఎఫ్ఎక్స్ తో రూపొందించనున్నారు. స్టార్ క్యాస్టింగ్ - అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం వర్క్ చేయనున్నారు.భారతీయుల సూపర్ హీరో హనుమంతుడి పేరుతో వస్తున్న ఈ చిత్రంలో సూపర్ ప్యాక్ యాక్షన్ సన్నివేశాలు.. సూపర్ హీరో ఫైటింగ్ పవర్స్ - ఎలివేషన్స్ ప్రేక్షకులను అబ్బురపరుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. 'జోంబీ రెడ్డి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రశాంత్ వర్మ - తేజా సజ్జా కాంబోలో వస్తున్న "హను-మాన్" చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూట్ వచ్చే నెల నుంచి ప్రారంభమవుతుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కు సంబంధించిన ఇతర నటీనటులు సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190